

జగన్ మళ్లీ వస్తే బతకలేం - 7లో
» దళిత సింహ గర్జన సభలో హర్షకుమార్
సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి - 7లో

వంతులవారీ నీటి వినియోగం పాటించాల్సిందే



» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
» దాళ్వా సాగులో రైతుల కష్టాలు
» ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది

సామర్లకోట, ఫిబ్రవరి 11: సామర్లకోట గోదావరి కాలువ జలాల ద్వారా ఆయకట్టులో ఎత్తిపోతల పథకాల పంపింగ్‌తో సాగువుతున్న దాళ్వా వరిసాగుకు నీటికష్టాలు ప్రారంభమయ్యాయి. గోదావరి ఎగువ ప్రాంతంలో నీటి నిల్వలు అడుగంటడంతో సహజంగానే గోదావరి కాలువనుంచి నీటి విడుదలలు తగ్గిపోయాయి. దీంతో సామర్లకోట శివారు ప్రాంతాలకే కాకుండా సామర్లకోట లాకులనుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్ ద్వారా 42వేల ఎకరాలకు సాగునీరు దినదిన గండంగా మారింది. ఈ తరుణంలో దాళ్వా వరిసాగు నీటి గండం నుంచి గట్టెక్కేందుకు ఎత్తిపోతల పథకాల్లో ఉచిత విద్యుత్‌తో పంపింగ్ చేస్తున్న తీరును ఏపీఎస్‌ఐడీసీ అధికారులు నియంత్రిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

సాగునీటి ఎద్దడిపై కలవరం

కాలువలో విడుదల చేస్తున్న నీటిని పెద్దబ్రహ్మదేవం, కాపవరం, ఇళ్లపల్లి, జి.మేడపాడు, పెద్దాడ, వేట్లపాలెం ఎత్తిపోతల పథకాలు వంతులవారీ నీటివినియోగం చేయాలని ప్రభుత్వంనుంచి ఉత్తర్వులు ఎత్తిపోతల పథకాల నిర్వాహకులకు అందా యి. గతనెల 28న ఆంధ్రజ్యోతిలో ఆయకట్టుకు సాగునీరందేనా పేరి ట నీటికష్టాలపై కథనం ప్రచురిం చిన విషయం తెలిసిందే. నేడు అదే నిజమైంది. దీంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎత్తిపోతల పథ కాల కింద సాగవుతున్న 5,100 ఎకరాలకు గడ్డుపరిస్థితి మొదలైన ట్లే. ఎండలు ఒకపక్క ముదురు తుండడం, సహజంగానే దాళ్వా సాగుకు ప్రస్తుత సమయంలో నీటితడులు అధికంగా కావాల్సి రావడంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఏంచేయాలో, పంటకాలం ఎలా గట్టెక్కుతుందా అనే అనుమానాలు రైతుల్లో ఇప్పుడే మొదలయ్యాయి. గడిచిన మూడేళ్లలో ఇటువంటి దారుణ పరిస్థితి ఎన్నడూ లేకపోవడంతో రైతులు నేటి సాగునీటి ఎద్దడికి కలవరం చెందుతున్నారు.ఐదు ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు రూ.18.80కోట్లకు పైబడి ఉన్నట్లు విద్యుత్ అధికారుల ద్వారా తెలిసింది. తమ బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఇప్పటికే ఎత్తిపోతల పథకాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను వినియోగిద్దామన్నా వంతులవారీ నీటి వినియోగంతో జనరేటర్లు ఏమాత్రం ఉపయోగపడవని రైతులు వాపోతున్నారు.

మోటార్లకు విద్యుత్ సరఫరా సమయాలు ఇవే..

వేట్లపాలెం ఎత్తిపోతల పథకానికి తెల్లవారుజామున 2 గంటలనుంచి ఉదయం 6 గంటల వరకూ నాలుగు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తారు.

ఇళ్లపల్లి, పెద్దబ్రహ్మదేవం, జి.మేడపాడు, కాపవరం ఎత్తి పోతల పథకాలకు రాత్రి 10గంటలనుంచి అర్ధరాత్రి 12గంటల వరకూ 2గంటలే విద్యుత్ సరఫరా చేస్తారు.

అంతిమంగా ఎత్తిపోతల పథకాలకు రోజుకు 4గంటలు మాత్రమే విద్యుత్ సరఫరాతో పూర్తి నియంత్రణతో ప్రభుత్వ వైఖరికి తాము పంటలను పూర్తిగా వదులుకోవాల్సిందేనాఅని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

వంతులవారీ నీటి వినియోగం ఇలా..

గోదావరి కాలువ జలాల ఆధారంగా ఎత్తిపోతల పథకాలు నిర్వహించే నిర్వాహకులు ప్రస్తుత దాళ్వా వరిసాగు పూర్తయ్యేవరకూ టర్న్ పద్ధతిన వంతులవారీ నీటి వినియోగం పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ప్రకారం ప్రతి ఎత్తిపోతల పథకానికి నెలలో నాలుగు టర్న్‌ల కింద నాలుగు దఫాలు మాత్రమే నీటిని రెండు రోజుల చొప్పున నెలలో 8 రోజులు మాత్రమే సాగునీటిని వినియోగించాల్సి ఉంది. అవి ఫిబ్రవరి నెలనుంచే అమలులో ఆచరించాలని ఆదేశించారు. 1, 2 తేదీల్లో మొదటి వంతుగా వేట్లపాలెం, ఇళ్లపల్లి, పెదబ్రహ్మదేవం, జి.మేడపాడు, కాపవరం ఎత్తిపోతల పథకాలు వినియోగించుకోవాలి. రెండో టర్న్ వంతుగా తిరిగి 10, 11 తేదీల్లోను, మూడో వంతుగా 19, 20 తేదీల్లోను, నాలుగో వంతుగా 28, 29 తేదీల్లోను, ఐదో వంతుగా మార్చి 8, 9 తేదీల్లోను, ఆరో వంతుగా 17, 18 తేదీల్లోను, ఏడో వంతుగా 26, 27 తేదీల్లోను, ఎనిమిదో వంతుగా ఏప్రిల్ 4, 5 తేదీల్లోను, 9వ వంతుగా 13,14 తేదీల్లోను వినియోగించుకోవాల్సి ఉంది.

రైతులకు అందని.. సున్నా వడ్డీ



» రెండేళ్లుగా ఖాతాలకు జమకాని వైనం
» అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు
» పట్టించుకోని ప్రభుత్వం
» జిల్లాలో 1.92లక్షలమంది రైతులు ఎదురుచూపులు

కోటనందూరు, ఫిబ్రవరి 11: అన్నదాతలను అన్నిరకాలుగా ఆదుకుంటామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్పితే తగుచర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో కడితే సున్నా వడ్డీ చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం పరిపాటిగా మారింది. రెండేళ్లుగా సున్నా వడ్డీకోసం రైతుల ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుల ఊబిలో ఇరుక్కుపోయిన రైతులకు ఆర్థిక దన్నుగా ఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తామన్నారు. అలాంటిది 2022 నుంచి 2024 వరకు, జిల్లాలో 1.92లక్షల మంది రైతులకు సున్నావడ్డీ రావాల్సి ఉంది. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా రాకపోవడంతో రైతులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు ఖరీఫ్‌లో 1.91లక్షలమంది రైతులు రూ.31.92కోట్ల రుణాలు తీసుకున్నారు. రబీలో 1.26లక్షలమంది రూ.19కోట్లు రుణాలు తీసుకున్నారు. అప్పటినుంచి వీరికి సకాలంలో రుణాలు చెల్లింపులు చేసినా సున్నా వడ్డీ రాయితీ రాకపోవడంతో అప్పుల ఊబిలోకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి ఏమీ పట్టనట్టు ఉండడం గమనార్హం. గత టీడీపీ హయాంలో కంటే అధిక మొత్తంలో సాయం చేస్తామంటూ సీఎం జగన్ ప్రకటించారు. చివరకు రూ.లక్షకు కుదించారు. సున్నా వడ్డీ రాయితీకి సంబంధించి ఖరీఫ్, రబీకి కోట్లలో బకాయిలు ఉన్నాయన్నారు.

కేంద్రం యథావిధిగా రాయితీ

రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు సున్నావడ్డీ మాఫీ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీ కిసాన్ క్రెడిట్ కార్డు పథకం నిబంధనకు అనుగుణంగా రాయితీలు ఇస్తున్నారు. ఈ మేరకు సీజన్ ముగిసే సమయానికి ఇవి జమకావాలి. సున్నా వడ్డీ కింద రాష్ట్రప్రభుత్వం 4శాతం వడ్డీ చెల్లించాలి. ఇలానే రూ.3లక్షలలోపు రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లిస్తే ప్రాంప్ట్ రీపేమెంట్ సున్నావడ్డీ పేరుతో కేంద్రం 3శాతం నగదు జమచేయాలి. కేంద్రం యథావిధిగా అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సున్నా వడ్డీ జమ చేయడంలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు సున్నా వడ్డీ అందేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు నివేదికలు అందించాం

రైతులకు సున్నావడ్డీ రాయితీపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. త్వరలో వడ్డీ రాయితీ వస్తుందన్నారు. అందరికీ అందిస్తామన్నారు.

-సుంకర బుల్లిబాబు, వ్యవసాయశాఖ ఏడీ, తుని

సున్నా వడ్డీ రాయితీ అందడం లేదు

రెండేళ్లుగా సున్నావడ్డీ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రైతు సంక్షేమమేనని చెబుతున్నా అసలు పట్టించుకోవడం లేదు. సున్నావడ్డీ వచ్చే లాగ చూడాలన్నారు.

-కొరుప్రోలు నాగబాబు, రైతు, కోటనందూరు

16న దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలి

» ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు



జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న తాటిపాక మధు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబి స్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాకినాడ జిల్లాలో 14 మండలాలు, 100 గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రచార సైకిల్ ర్యాలీని కాకినాడ శాంతినగర్‌వద్ద ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీకి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మధు, ప్రసాద్ మాట్లాడుతూ మోదీ వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపద, రవాణా, బ్యాంకులు, ఎల్‌ఐసీ సంస్థలను అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టారని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు ఊసేలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు నష్టాలు వస్తున్నాయనే సాకుతో కార్మిక చట్టాలు రద్దు చేసి దొడ్డిదారిన నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ఏఐటీయూసీ నాయకులు అన్నవరం రామయ్య, శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ప్రయాణికులకు రక్షణ కరువు

» పెట్రేగిపోతున్న ఆకతాయిలు
» మద్యం మత్తులో ప్రయాణికులపై వీరంగం



బీచ్‌రోడ్డులో శిథిలమైన పెద్ద వంతెన

కొత్తపల్లి, ఫిబ్రవరి 11: ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో ఆకతాయిలు పేట్రేగిపోతున్నారు. చీకటి పండిందంటే చాలు మద్యం, గంజాయి పూటుగా సేవించి మత్తులో బీచ్‌రోడ్డులో ప్రయాణికులపట్ల పేట్రేగిపోవడం ఆకతాయిల దినచర్యగా మారింది. సాయంత్రం పూట చల్లని గాలులు ఆస్వాదించేందుకు విచ్చేస్తున్న పర్యాటకులపై ఆకతాయిలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఆడవాళ్ల మెడలో, చేతులకు ఉన్న ఆభరణాలను బలవంతంగా అపహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కాకినాడనుంచి పిఠాపురం మీదుగా ఉప్పాడ దూరమైనా బతుకు జీవుడా అని పిఠాపురం మీదుగా ఉప్పాడ చేరుకుంటున్నామని వాపోతున్నారు. ఇటీవలకాలంలో ఒక వ్యక్తి రాత్రిపూట బైక్‌పై బీచ్ రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లేందుకు బయలుదేరాడు. బీచ్‌రోడ్డులో శిథిలమైన పెద్ద స్థానే నిర్మించిన చిన్నవంతెన సమీపానికి చేరేసరికి మద్యం, గంజాయి మత్తులో తూగుతున్న ఆకతాయిలు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కత్తితో వెంబడించారు. భయమేసి ఆగిన వ్యక్తినుంచి మొబైల్, రూ.4000 నగదు లాక్కున్నారు. ఈలోగా వెనుక నుంచి వస్తున్న వేరే ఆటోను గమనించిన ఆకతాయిలు నగదు, సెల్ వదిలేసి పరారయ్యారు. చిన్నవంతెన వద్ద వదిలిన ఫోన్ నగదును కొత్తపల్లి పోలీసులకు ఆటోలో ఒక వ్యక్తి అందజేసినట్టు తెలిసింది. మద్యం, గంజాయి సేవించే ఆకతాయిలకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో బాగా పేట్రేగిపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ ఈ వంతెన వద్ద పగటిపూట పర్యాటకులతో సందడిగా ఉంటుంది. రాత్రిపూట ఆకతాయిలకు అడ్డాగా తయారవుతుందని చెబుతున్నారు. ఉప్పాడ కాకినాడ బీచ్‌రోడ్డు మాత్రం చీకటి పడిందంటే ఆడవాళ్లు ప్రయాణించకపోవడం శ్రేయస్కరమని తీరప్రాంత మత్స్యకారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో చాలామంది యువకులకు ఉపాధి లేకపోవడం స్నేహితులతో జల్సాగా తిరగడం, దారికాని దోచుకున్న నగదులో మద్యం సేవించి చిందులు వేయడం పనిగా పెట్టుకున్నారని చెబుతున్నారు. ఉప్పాడనుంచి లైట్ హౌస్ సూర్యారావు పేటవరకు రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆట కట్టించాలని ప్రజలు ప్రయాణికులు పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

సెల్, నగదు స్వాధీనం చేసుకున్నాం: ఎస్ఐ స్వామి

బీచ్‌రోడ్డులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తినుంచి దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకున్నాం. నగదు, మొబైల్ బీచ్‌రోడ్డులో వదిలి వెళ్లడంతో ఆ దారినపోయే వ్యక్తి తీసుకొచ్చి స్టేషన్‌కు అందజేశారు. ఉప్పాడ నేమాం బీచ్‌రోడ్డు సరిహద్దులో రాత్రిపూట పోలీసు పహారా ఏర్పాటు చేస్తున్నాం.



కాకినాడ జీజీహెచ్‌లో డాక్టర్ ప్రసన్నను సత్కరిస్తున్న వైద్యుల బృందం

ముగిసిన చీలిక పెదవుల శస్త్రచికిత్సలు

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 11: కాకినాడ జీజీహెచ్‌లో 40మంది బాలల చీలిక పెదవుల శస్త్రచికిత్సలు రెండురోజులుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రంగరాయ వైద్యకళాశాల(ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్, అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఆర్ఎంసీ బృందం, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం ఆదేశాల మేరకు శస్త్రచికిత్సలో పాల్గొన్న బృందాన్ని ఆదివారం ఘనంగా సత్కరించింది. కోల్‌గేట్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా చీలిక పెదవుల శస్త్రచికిత్సకోసం రూ.20లక్షల నిధులను కేటాయించింది. ఈ మొత్తాన్ని మిషన్ స్మైల్ జీజీహెచ్‌లో 40మంది బాలలకు తన బృందంతో కలిపి శస్త్రచికిత్స చేసింది. జీజీహెచ్ అనస్తీషియా, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాల హెచ్‌వోడీలు, వైద్యబృందాలు పూర్తి సహాయ, సహకారాలు అందించాయి. ఈ కార్యక్రమ నిర్వహణకు కలెక్టర్ కృతికాశుక్లా, స్థానిక ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేశారని డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండో దశల్లో 85మందికి శస్త్రచికిత్సలు పూర్తి చేశారని, ఈ ఏడాదిలో మూడోదశ తాజాగా నిర్వహించామని, నాల్గో దశ కూడా త్వరలో నిర్వహించే ప్రణాళికలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చీలికల శస్త్రచికిత్సలు కీలకంగా వ్యవహరించిన వైద్యబృందానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రత్నభూషణ్, అనస్తీషియా వైద్యనిపుణులు డాక్టర్ గుడాల ప్రసన్న, డాక్టర్ వింధ్య, డాక్టర్ పర్వీన్, అనస్తీషియా పీజీలు డాక్టర్ అచ్యుత్, డాక్టర్ గుణప్రియ, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ శశి, డాక్టర్ సుధీర్, మిషన్ స్మైల్ డైరెక్టర్ వెంకటేషన్ పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పయనం



సామర్లకోట మీదుగా అయోధ్యకు బయలుదేరుతున్న ప్రత్యేక రైలు

సామర్లకోట, ఫిబ్రవరి 11: అయోధ్య రామాలయం సందర్శించే భక్తుల సౌకర్యార్థం రైల్వే దేశవ్యాప్తంగా 8 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను వివిధ ప్రాంతాలనుంచి అస్థా పేరిట ప్రారంభించింది. వీటిలో ఓ రైలు కాకినాడ రైల్వేస్టేషన్ నుంచి సామర్లకోట మీదుగా విశాఖవైపు వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరింది. తొలుత సామర్లకోటనుంచే ఈ రైలు అయోధ్యకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ప్రకటించినప్పటికీ జిల్లా కేంద్రమైన కాకినాడ నుంచి ప్రారంభించాలని కొందరు చేసిన విజ్ఞాపనల మేరకు కాకినాడ టౌన్‌స్టేషన్ నుంచి ప్రారంభించారు. సామర్లకోటకు చేరుకున్నప్పుడు సామర్లకోట స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తదితర రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికులకు ప్రత్యేక సేవలందించారు.

ఎస్‌బీఐ చోరీ ఘటనలో పురోగతి

» పోలీసుల దర్యాప్తులో దొంగల ముఠా కదలికల సమాచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11: ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో ఎస్‌బీఐ బ్యాంక్‌లో జరిగిన చోరీఘటనపై జిల్లా పోలీసులకు కీలక సమాచారం లభించినట్లు తెలిసింది. ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.75లక్షల విలువైన బంగారు నగలు, నగదు దొంగల ముఠా ఇటీవల అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చోరీకి పాల్పడిన నిందితులు సామర్లకోటలో మకాం ఉన్న కీలక సమాచారం పోలీసులకు లభించినట్లు తెలిసింది. ఉత్తరకంచిలో బ్యాంక్ చోరీకి పాల్పడుతూ దుండగులు సామర్లకోటలోని ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కొన్నిరోజులు నివాసం ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సామర్లకోట నుంచే ఉత్తరకంచి బ్యాంక్‌కు చోరీకి పాల్పడే ముందు రెక్కీ నిర్వహించినట్లు భావిస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తరకంచి చోరీ జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారు తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. దొంగలు ఉత్తరకంచి బ్యాంక్ చోరీకి పాల్పడి బయటకు వస్తున్న సీసీ కెమెరా ఫుటేజ్ కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. వీరి కదలికలపై పూర్తి నిఘా ఉంచిన పోలీసులకు సామర్లకోటలో దొంగల ముఠా ఒక అద్దె ఇంట్లో ఉంటూ చోరీకి పాల్పడిన కీలక సమాచారాన్ని కనుగొన్నారు. దీంతో ముఠాను పట్టుకునేందుకు సామర్లకోటనుంచి దొంగలు ఎటువైపు వెళ్లారనేది మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

'లోవ' టోల్‌గేట్‌లో వసూళ్ల దందా

» నిబంధనలకు నీళ్లు వదిలిన నిర్వాహకులు
» అధిక రేట్లు వసూలు చేస్తున్నారంటున్న భక్తులు

తుని రూరల్, ఫిబ్రవరి 11: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం టోల్‌గేట్ వద్ద వసూలు దందా కొనసాగుతోంది. అమ్మవారి దర్శనార్థం రాష్ట్రం నలుమూలలనుంచి తరలివస్తున్న భక్తులను టోల్‌గేట్ నిర్వాహకులు అడ్డగోలుగా దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేంటని ప్రశ్నిస్తే అంతా మా ఇష్టం అన్న చందాన సమాధానం ఇస్తూ భక్తులతో వాగ్వివాదానికి దిగుతున్నట్లు తెలిసింది. ఆలయ నిబంధనల ప్రకారం టోల్‌గేట్ కాంట్రాక్టర్ నిర్దేశించిన రుసుమును ఆలయ నిబంధనలకు అనుగుణంగా వసూలు చేయాల్సి ఉంది. కానీ, లోవ దేవస్థానంలో ద్విచక్ర వాహనానికి రూ.10, ఆటోకు రూ.15, చిన్నకారుకు రూ.50, వ్యాన్ లేక ట్రాక్టర, టాటాసుమో, జీపులకు రూ.70, లారీ, టూరిస్ట్ బస్సులకు రూ.100 వసూళ్లు చేయాల్సి ఉంది. దీనికి పూర్తి విరుద్ధంగా టోల్‌గేట్ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. రూ.10కి బదులు రూ.20, రూ.15కు బదులు రూ.30 ఇలా డబుల్ రేట్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు లోవకు వస్తున్న భక్తులు వాపోతున్నారు. ఆలయ నిర్దేశిత రేట్ల బోర్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ బోర్డులో రేట్లు కనిపించకుండా చేసి ఈ అడ్డగోలు వ్యవహారానికి తెరతీయడం.. దీన్ని ఆలయ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డబుల్ రేట్ల వసూళ్లపట్ల లోవకు వస్తున్న భక్తులు ప్రశ్నిస్తే ఇక్కడ ఇంతే.. చెల్లించి కదలాల్సిందే అని హుక్కుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు సందర్భాల్లో భక్తులతో వాగ్వివాదం దిగిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు టోల్‌గేట్‌వద్ద డబుల్ వసూళ్లపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు, వాహనదారులకు రేట్లు స్పష్టంగా కనిపించేలా టోల్‌గేట్‌కు 100 మీటర్ల దూరంలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



లోవ టోల్‌గేట్‌వద్ద వసూళ్లు చేపడుతున్న నిర్వాహకులు



డిస్‌ప్లే బోర్డులో రేట్లు కనిపించకుండా చేసిన దృశ్యం

విషాద యాత్ర

- సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి
- రంపయర్రంపాలెంలో విషాదఛాయలు



విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు

గోకవరం, ఫిబ్రవరి 11: విహారయాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరం-భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లాలో రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. కన్నవారికి తీవ్ర శోకాన్ని మిగిల్చారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకటఅర్జున్(15), అండిబోయిన దేవిచరణ్(15), లావేటి రామన్‌జీ(15), తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు రంపయర్రంపాలెంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురు రెండు మోటారు సైకిళ్లపై విహారయాత్రకంటూ ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద కాసేపు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. 3-4గంటల మధ్య అర్జున్, దేవిచరణ్, రామన్‌జీ స్నానం చేసేందుకు వాగులోకి దిగారు. కొద్దిసేపటికి వారి జాడ కనిపించకపోవడంతో గట్టున ఉన్న ఇద్దరు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రంపయర్రంపాలేనికి చెందిన మరికొందరు పర్యాటకులు విషయం తెలుసుకొని వారికోసం వెతకడం ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఈతగాళ్లు వాగులోకి దిగి గాలించగా ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● గ్రామంలో విషాద ఛాయలు: విహారయాత్రకు వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీతపల్లివాగులో పడి మృతి చెందడంతో రంపయర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకు కళ్ల ముందే కలియదిరిగిన ముగ్గురు విద్యార్థులు వాగులో పడి మృతి చెందారన్న విషాదవార్తను గ్రామస్థులను కలిచివేసింది. గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థుల్లో చాలామంది విద్యార్థుల మృతదేహాలను చూసేందుకు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రి వద్దకు వెళ్లారు.

● తీవ్ర శోకాన్ని మిగిల్చారు: మనం తిన్నా తినకపోయినా పదో తరగతి వరకు చదివించాం. ఇంకో రెండు, మూడేళ్లు ఏదో రకంగా కష్టపడి చదివిస్తే మనకు అండగా ఉంటారనుకున్నామని, ఇంతలోనే తమ ఆశలపై నీళ్లు చల్లి తీవ్ర శోకాన్ని మిగిల్చారంటూ మృతుల తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. కాగా అర్జున్ తండ్రి కాకార విష్ణు రేషన్‌షాపు డీలర్. దానిపైన వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ జరుగుతోంది. దేవిచరణ్ తండ్రి అండుబోయిన అప్పారావు వ్యవసాయ కూలి. ఏపూటకాపూట కూలిపనికి వెళ్తేనే గాని జీవనం సాగదు. రామన్‌జీ తండ్రి సత్తిబాబు కూడా వ్యవసాయ కూలీనే. ఇతను కూడా పనికి వెళ్తేనే ఆ కుటుంబంలోని అందరు కడుపులు నిండుతాయి.



మృతులు కాకర వీరవెంకటఅర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రామన్‌జీ

(రంపచోడవరం)

అల్లూరి జిల్లాలో పలు విహార కేంద్రాలు మృత్యుకుహారాలుగా మారి పలు కుటుంబాలలో విషాదాన్ని మిగుల్చుతున్నాయి. ముఖ్యంగా పాపికొండలు, కొండ వాగులు, జలపాతాలు, ప్రమాదకరమైన గిరి ప్రాంతాలు ఇలా మన్యం నలుమూలలగా విస్తరించిన విహార క్షేత్రాలలో ఎక్కడా కూడా సరైన రక్షణ చర్యలు లేకపోవడమే ప్రమాదాలకు మూలమవుతోంది. కొండవాగులలో చోటు చేసుకుంటున్న ఇసుక అక్రమ తవ్వకం వంటి మానవ తప్పిదాలు కూడా ఆయా కేంద్రాలను ప్రాణాపాయ కేంద్రాలుగా మార్చేశాయి. ఆదివారం భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపాన ఉన్న సీతపల్లి వాగు పర్యాటక కేంద్రంలో చోటు చేసుకున్న ముగ్గురు విద్యార్థులను బలితీసుకున్న ప్రమాద ఘటన ఇందుకు అద్దం పడుతోంది. గత నెలలో ఇదే ప్రాంతంలో ఇద్దరు సీతపల్లి వాగులో దిగి మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటనా ప్రాంతాన్ని, దాని పరిసరాలను పరిశీలిస్తే అక్కడ చోటుచేసుకున్న అనేక మానవ తప్పిదాలు, ఇవి తెలిసీ కూడా వాటిని నిరోధించాల్సిన వ్యవస్థల నిర్లక్ష్యం తరచు ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక్కడ వాగును అక్రమంగా ఇసుక త్రవ్వకాల కోసం వాడుకోవడం, వాగు ప్రాంతం ఇసుక త్రవ్వకాలతో లోతుగా ప్రమాదకరంగా మారడం, ఇది తెలియని పర్యాటకులు వాగులో దిగి మృత్యువాత పడటం ప్రహసనంగా మారింది. ఈ పర్యాటక కేంద్రంలో ప్రభుత్వపరంగా సరైన రక్షణ చర్యలు కానీ, వాగు వద్ద పర్యాటకులను వారించే వ్యవస్థలు, వ్యక్తులూ లేకపోవడంతో పర్యాటకుల విచ్చలవిడి విహారానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఈ వాగు ఇప్పటికే ఎన్నో ప్రాణాలను బలితీసుకున్నా, ఈ విషయాలను తెలిసి కూడా అక్కడ రక్షణ కంచెలను ఏర్పాటుచేసి పర్యాటకులను వాగులోకి దిగకుండా నిరోధించలేని నిర్లక్ష్యాలే ఈ ప్రమాదాలకు కారణమయ్యాయి.



సీతపల్లివాగులో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యం

ఊపిరి తీస్తున్న విహారం..

- విహార కేంద్రాల్లో లోపించిన రక్షణ చర్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

ఈ ఒక్క ప్రాంతమే కాదు మన్యం నలుమూలలుగా మోతుగూడెం, డొంకరాయి, పాపికొండలు, మారేడుమిల్లి, అడ్డతీగల, వైరామవరం తదితర మండలాలల్లో ఉండే ప్రమాదకర జలపాతాలూ, ఎత్తైన ప్రమాదకర కొండలు, గుడిసె క్షేత్రం వంటి ప్రాంతాలలో పోలీసు, రెవెన్యూ, అటవీశాఖలు పూర్తిగా విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో పాపికొండలు ప్రాంతంలో చోటుచేసుకున్న బోటు ప్రమాదం ఎన్నో కుటుంబాలలో విషాదాన్ని నింపిన అనంతరం పాపికొండల విహారానికి ఎన్నో ఆంక్షలతో ప్రమాదాలు నిలువరించబడ్డాయి. కానీ ఇతర ప్రాంతాల విషయంలో కూడా ఈ ప్రమాదాలను ముందస్తుగా నిరోధించగల సత్తా ఉన్నా, ఆయా శాఖలు, అధికారులు పరోక్షంగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంస్థలకు, వ్యక్తులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుండటంతో ఆయా అధికారులు సైతం తప్పనిసరి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. మన్యంలో కేంద్ర సర్వీసులకు చెందిన ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే ఆయా శాఖలు పనిచేస్తున్నా ఇటువంటి ప్రమాదాలను నిరోధించే చర్యలను తీసుకోవడంలో వారిని నిరోధించే వ్యవస్థలదే పైచేయి కావడంతో అంతటి కేంద్ర సర్వీసుల ఉన్నతాధికారులు సైతం చోద్యమే చూస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం కేవలం ఆదాయమే ఆపేక్షగా కాకుండా కట్టుదిట్టమైన రక్షణ, భద్రతా చర్యలను చేపడితే ప్రమాదరహిత విహారం మన్యంలో శోభిల్లుతోంది.

జైలు నుంచి ఇంటికి..

- ఐదేళ్ల తరువాత ఇంటికి చేరిన కోడి కత్తి శ్రీను

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: కోడి కత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకి హైకోర్టులో బెయిల్ లభించడంతో ఆదివారం స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలోని తమ నివాస గృహానికి చేరుకున్నాడు. బెయిల్ రావడం చాలా ఆనందంగా ఉందని జనిపల్లి శ్రీనివాసరావు ఈసందర్భంగా పేర్కొన్నారు. జైల్లో తాను డిగ్రీ పూర్తి చేశానని, లా చదవాలనుకున్నాను. అయితే అందుబాటులో లేకపోవడంతో బీఏ డిగ్రీ పూర్తిచేసి ఎంఏ సోషియాలజీ చదువుతున్నాను. సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు సోషియాలజీని చదువుతున్నట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జైల్ సూపరింటెండెంట్ రాజారావు, జైలర్ కుమారస్వామి, అంబేడ్కర్ యూనివర్శిటీ లెక్చరర్ అనంతలక్ష్మిలు తాను చదవడానికి ఎంతో తోడ్పాటును ఇచ్చారన్నారు. మైనార్టీ హక్కుల సంక్షేమ సంఘం, సమతా సైనిక్‌దళ్‌వారు పోరాటం, న్యాయవాది సలీమ్ కృషివల్ల తనకు బెయిల్ లభించిందన్నారు.



న్యాయవాది సలీమ్‌తో పోలీసుస్టేషన్‌కు హాజరవుతున్న శ్రీనివాసరావు

న్యాయవాది కృషి ఫలితమే : తల్లిదండ్రులు సావిత్రి, తాతారావు

కుమారుడు శ్రీనివాసరావు బెయిల్‌పై ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉందని తండ్రి తాతారావు, తల్లి సావిత్రి పేర్కొన్నారు. శ్రీనివాసరావు జైల్లో ఉన్నప్పుడు తమ న్యాయవాది సలీమ్ ఎంతో ఆదరించి అండగా నిలబడ్డారన్నారు. విజయవాడలో నాలుగు ప్రజా సంఘాలు చేసిన పోరాటానికి న్యాయవాది కృషి ఫలితంగా కుమారుడికి బెయిల్ వచ్చిందని, లేకపోతే వచ్చి ఉండేది కాదన్నారు. న్యాయవాది సలీమ్, ప్రజా సంఘాలకు తమ కుటుంబం చాలా రుణపడి ఉంటామన్నారు.

బాహుబలి-2 ముందుంది : న్యాయవాది సలీమ్

ఈ కేసులో ఐదు సంవత్సరాలు ప్రయాణం చేశారు. శ్రీనివాసరావు కుటుంబంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. శ్రీనివాసరావు తల్లి సావిత్రి నా సలీమ్ అని పలకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. వ్యవస్థ ఒక అమాయకుడి పట్ల ఎలా మిస్‌చీఫ్ చేసిందో ఈ కేసులో తెలిసింది. తెలుగుదేశం, వైసీపీల మధ్య రాజకీయాలు శ్రీనివాసరావును బలి పశువును చేశాయి. ఫలితంగా ఐదు సంవత్సరాల జీవిత కాలాన్ని ఒక దళిత యువకుడు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కేసులో బాధితుడు ముఖ్యమంత్రి కావడం వల్లనే దీనిపై కీలక ప్రభావం చూపించిందని, లేదంటే ఎప్పుడో బెయిల్ వచ్చేదన్నారు. కేసు కూడా తేలిపోయి ఉండేదని అభిప్రాయ పడ్డాడు. ఈ కేసు వాదించేందుకు న్యాయవాదులెవరూ ముందుకు రాలేదు. ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా తానే కేసును వాదించానని శ్రీనివాసరావు కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావిస్తున్నానన్నారు. శ్రీనివాసరావు 5వేల పుస్తకాలు జైల్లో చదివాడని, సమాజంలో మంచి కోసం పోరాటం చేస్తానని, అందుకు నా సహకారం కూడా కావాలన్నారు. ఈ కేసులో సీఎం జగన్ మనసులేని వ్యక్తిగా ప్రవర్తించారని, విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన జగన్ ఆయన వారుసులైన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపట్ల మనసు లేకుండా ప్రవర్తించారన్నారు. సీఎం ఎన్‌వోసీ ఇచ్చినా, కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పినా ఇంత సమయం వృథా అయ్యేది కాదన్నారు. బాహుబలి-2లో కట్టప్పను బయటకు లాగుతాం. ఎవరి హస్తం ఉందో తేల్చి శ్రీనివాసరావుపైన పడిన మచ్చను కడిగేస్తామన్నారు.

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం

- రూ.3.65లక్షల ఆదాయం



తుని రూరల్, ఫిబ్రవరి 11: లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామున అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవోవిశ్వనాథ రాజు ప్రత్యేక ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులతో వివిధ విభాగాల ద్వారా రూ.3.65లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

సరదా కోసం వెళ్లి తిరిగి రాని లోకాలకు..

- యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డు ప్రమాదం
- ఇద్దరు యువకుల మృతి



యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డుప్రమాదంలో మృతి చెందిన జానీ, ప్రసాద్

కె.గంగవరం/అనపర్తి, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని యర్రపోతవరం లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పామర్రు ఎస్.ఐ. జానీ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి సావరంకు చెందిన దుర్గాడ జానీ(26), లక్ష్మీనరసాపురంకు చెందిన పిల్లి ప్రసాద్(28)లు మరో ఇద్దరు స్నేహితులతో కలసి ఆదివారం ఉదయం యానాం వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని తిరిగి యానాం నుంచి అనపర్తి వెళుతున్న సందర్భంలో యర్రపోతవరం లాకుల వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో జానీ, ప్రసాద్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సి.ఐ. పి.దొరరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరణించిన ప్రసాద్, జానీ మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు చెప్పారు. ప్రసాద్, జానీ మరణంతో రెండు కుటుంబాలు వారు కుటుంబ పెద్దలను కోల్పోయారు. వీరిలో జానీకి చదువుకుంటున్న తమ్ముడు, ప్రసాద్‌కు పెళ్లీడుకు వచ్చిన చెల్లెలు ఉన్నారు. వీరి మరణంతో అనపర్తి సావరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

రెండు కుటుంబాల్లో విషాదం

ఆదివారం పనికి సెలవు కావడంతో స్నేహితులు సరదాగా గడిపేందుకు యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. చేతికందిన కొడుకులు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాలలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి ప్రసాద్(26), అనపర్తి సావరంనకు చెందిన దుర్గాడ జానీ(28) స్నేహితులు. ఇద్దరూ అవివాహితులే.. తాపీ పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇద్దరికీ తండ్రులు లేకపోవడంతో రెండు కుటుంబాలకు వారే ఆధారం కావడంతో రెండు కుటుంబాల వారు అనాథలుగా మిగిలారు. ఆదివారం తాపీ పనికి సెలవు కావడంతో ఇద్దరూ మోటారుసైకిల్‌పై యానాం వెళ్లి సరదాగా గడిపారు. తిరుగు ప్రయాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులవద్దకు చేరుకునే మోటార్‌సైకిల్.. లారీని ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భర్తలు లేరు.. కడవరకు తమను చూసుకుంటారని గంపెడు ఆశలు పెట్టుకున్న ఆ తల్లులు.. కుమారులు అర్థాంతరంగా తమను విడిచి వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు యువకుల మృతితో రెండు గ్రామా ల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

సత్యదేవుడి సన్నిధిలో

ప్రారంభమైన మాఘమాసపు రద్దీ

- రూ.40 లక్షల ఆదాయం



అన్నవరం, ఫిబ్రవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మాఘమాసపు రద్దీ ప్రారంభమైంది. గతనెల రోజులుగా పుష్యమాసం శూన్యమాసం కావడంతో శుభకార్యక్రమాలు లేక ఆలయంలో సాధారణ రద్దీ మాత్రమే ఉండేది. వివాహాలు సీజన్ ప్రారంభంకావడం ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి విచ్చేశారు. భక్తులు అధికసమయం వేచి ఉంచకుండా ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అంత్రాలయ ప్రదక్షిణ దర్శనం టిక్కెట్లను కొద్దిసేపు నిలుపుదల చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

సూర్యభగవానుడికి ప్రత్యేకపూజలు

మాఘపు ఆదివారం పురస్కరించుకుని కళామందిరంలో రుత్విక్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు సూర్యనమస్కారములు కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఆసనాలతో ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానుడిని ఆవాహన చేయించి క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11 : ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. మాఘమాసంలో వచ్చిన తొలి ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేష భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామివారికి పాలపొంగులు, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగన్ మళ్లీ వస్తే బతకలేం

- దళితులను ఇంత నీచంగా చూసిన ముఖ్యమంత్రిని చూడలేదు ● దగా పడ్డ దళితుల ఆత్మగౌరవ పోరాటమే సింహగర్జన ● బీసీలకు తగ్గకుండా కాపుల రిజర్వేషన్లుకు మద్దతిస్తాం
- అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ● వేమగిరిలో దళిత సింహ గర్జన సభ



సింహగర్జన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ/కడియం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారని, వారి ఆత్మగౌరవ పోరాటమే ఈ సింహగర్జన సభ అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలో వేమగిరి జాతీయ రహదారి వద్ద మైదానంలో ఆదివారం సాయంత్రం జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తూ ఆయన దళిత సింహగర్జన సభను నిర్వహించారు. విజయనగరం నుంచి అనంతపురం వరకు, ఆంధ్రాతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి దళితులు హాజరయ్యారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవనరామ్‌లకు నివాళులర్పించారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోరాడితే పోయేది లేదు.. బానిస సంకెళ్లు తప్ప అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం జగన్ దళితులను నమ్మించారని, క్రైస్తవులు నమ్మి జగన్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అయితే మణిపూర్‌లో క్రైస్తవులపై మారణ కాండ సృష్టిస్తే ఈ సీఎం కనీసం స్పందించలేదని, పైగా ఆనాడు అవిశ్వాసం పెడితే కేంద్ర ప్రభుత్వానికి ఈ వైసీపీ ఎంపీలు ఓటు వేశారని గుర్తు చేసారు. దేశంలో దళితులను ఇంత నీచంగా చూసిన జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో బక్కి శ్రీను మొదలు డ్రైవరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, గుంటూరులో రమ్య, అనంతపురంలో స్నేహలత, పులివెందులలో నాగమ్మ, కడపలో డాక్టర్, దొమ్మేరులో మహేంద్ర, నడింపల్లి రాము హత్యాకాండలు.. అలానే మైనింగ్‌ను ప్రశ్నించిన వరప్రసాద్ శిరోముండనం సంఘటన ఇలా చెపుతూ పోతే చాలా మంది దళితులు బలయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని, దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారని, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు లేకుండా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దళితులకు దక్కాల్సిన రూ.75 లక్షల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాత్ర సినిమా చేసిన దర్శకునికి రెండెకరాల భూమి ఇచ్చిన ఈ ప్రభుత్వం బాధిత దళితులకు భూమిని కేటాయించలేకపోయిందని విమర్శించారు. అమ్మఒడి పథకానికి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుచేశారన్నారు. బేస్ ఎవలైబుల్ స్కీంను రద్దు చేసిందని, ఇంత మంచి స్కీంను తీసివేయడంపై సుప్రీంకోర్టు స్పందించి పునరుద్ధరించాలని చెప్పిందన్నారు. కులాంతర వివాహం స్కీంను జగన్ రద్దు చేశాడని గుర్తుచెశారు. ఎస్ఎస్‌సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గతంలో కార్లు ఇచ్చేవారని అది లేదని, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రూ. లక్ష సబ్సిడీ వచ్చేదని అదీ రద్దు చేశాడని ధ్వజమెత్తారు. దళితులను దగా చేసిన ఈ ముఖ్యమంత్రి మళ్లీ వస్తే దళితులు బతకలేరని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులంతా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోండి.. ఎందుకంటే అది ఇసుక, మద్యం, కొండలు దోచేసిన డబ్బే కదా.. కాని జగన్‌కు ఓటు వేయొద్దన్నారు. జగన్‌ను దించే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో బీసీలకు తగ్గించకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. తొలుత ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేత జార్జి సీమంతుల మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హర్షకుమార్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. జగన్.. పాస్టర్లకు గౌరవ వేతనం అంటూ 29 వేల మందిని గుర్తించి కేవలం 8 వేల మందిని ఎంపిక చేశారన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ అని పెట్టి చర్చిలు కడతామని మాట ఇచ్చి ఒమ్ము చేశారన్నారు. జంగా బాబూరావు మాట్లాడుతూ దళితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అభివృద్ధి కుంటుపడిందన్నారు. దళిత సత్తా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ దళిత సైన్యం సిద్ధంగా ఉందని, జగన్ అంతం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు బక్కి శ్రీను భార్య, నడింపల్లి గంగమ్మ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. జీవీ శ్రీరాజ్ మాట్లాడుతూ దళిత సింహగర్జన సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై అమరావతిలో ఓ సమావేశం పెడతామని అటుపై గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. ఈ సభలో ఏలూరు మాలమహాసేన అధ్యక్షుడు రవికుమార్, బొజ్జా ఐశ్వర్య, నడింపల్లి గంగమ్మ, అయితాబత్తుల సుభాషిణి మాట్లాడారు. సభలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు చిట్టిరాజు, హైదరబాదు గుడిమెళ్ల వినోద్, కప్పల వెలుగు, శ్యాంబాబు, సింగపల్లి రమేష్, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి విజయ్‌కుమార్, గెడ్డం వెంకట్రాజు, ఇసుకపట్ల వెంకటరమణ, గెడ్డం శ్రీను, కరుణాకర్, శ్యాంసుందర్, విజయనగరం ఆదాల మోహన్, నిడదవోలు బండి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.



తొండంగి నుంచి వచ్చి మాట్లాడుతున్న బాధితురాలు గంగ

కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందే

- ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 11: కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందేనని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో మూడురోజులుగా జరుగుతున్న పీఠం వార్షిక మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణచేస్తూ మానవుడు తన జీవన పయనంలో ఎదురయ్యే కష్టనష్టాలు, దుఃఖాలు, తదితర కాలపరీక్షలను ఎదుర్కోవాలంటే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కాలానికి అతీతంగా ప్రయాణించే జీవి ఏదీ సృష్టిలో లేదని చెప్పారు. తాత్వికులు, యోగులు అందరూ కాలగమనంతో ప్రయాణం చేసేవారేనని తెలిపారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక తత్వప్రబోధం, సామాజిక సేవల ద్వారా విశ్వమానవ శ్రేయస్సు కోసం పీఠం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గురువు ద్వారా పొందిన తాత్విక జ్ఞానాన్ని మరింతమందికి పంచాలని సూచించారు. అనంతరం ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. పీఠం ప్రచురించిన కరదీపికలు, గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, అహ్మద్ ఆలీషా, సాహితీవేత్త జానకిరామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బుజ్జీ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా, నన్నయ్య వీసీ పద్మరాజు

ఆకతాయిపై కేసు నమోదు

- బీరులో కల్తీ జరిగిందని వాదన
- ల్యాబ్ పరీక్షలో అతడే సిరా కలిపాడని నిర్ధారణ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11: బీరు సీసాలో ఇంకు కలిపి పలువురు అధికారులను ఇబ్బంది పెట్టిన ఓ ఆకతాయిపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన పట్టా వెంకటేశ్వర్లు ఈనెల 5న తన కుమారుడిని కాకినాడ జె.రామారావుపేటలోని బ్రాందీషాపునకు పంపి పాస్టర్స్ కంపెనీకి చెందిన రెండు బీర్‌లను రప్పించుకున్నాడు. అనంతరం ఒక బీర్ తాగాడు. మరో బీర్ మూత తీసేసరికి అది నీలం రంగులో ఉందని, అదేరోజు రాత్రి బ్రాందీ షాపునకు వెళ్లి అక్కడ సిబ్బందితో వాదనకు దిగాడు. దీంతో సిబ్బంది అధికారులకు తెలియజేయడంతో అసిస్టెంట్ రిటైల్ అవుట్ లెట్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి బృందం ఆ బీరు బాటిల్‌లోని ద్రవం నమూనాను ఆ బ్యాచ్‌కు మిగతా బీరుల నమూనాలను సేకరించి గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబోరేటరీకి పంపారు. శనివారం వచ్చిన ల్యాబ్ నివేదికలో బీరులో కల్తీ జరగలేదని, వెంకటేశ్వర్లు కావాలని బీరులో సీరా కలిపి అధికారులను ఇబ్బంది పెట్టినట్లు నిర్ధారణకు వచ్చారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.

నేడు పెద్దాపురం కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెద్దాపురం, ఫిబ్రవరి 11: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 12న సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశపు మందిరంలో నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు హాజరవుతారన్నారు.

జగన్ అరాచకాలపై లోకేశ్ శంఖారావం : రాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 11: సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం కార్యక్రమం అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోటలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో లోకేశ్ శంఖారావంతో పర్యటించి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలు, కార్యకర్తలకు వివరిస్తారన్నారు. రానున్న 40-50 రోజుల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారన్నారు. రోజులో 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉండే ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా లోకేశ్‌తో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతే గాకుండా ప్రజలకు ఈ శంఖారావం ద్వారా లోకేశ్ భరోసా కల్పిస్తారని చినరాజప్ప చెప్పారు.

'ప్రజలకు భరోసా కల్పించేందుకే శంఖారావం'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11: ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ దురాగతాలను వివరిస్తూ ప్రజలకు భరోసా కల్పించేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించారని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ శంఖారావంతో ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకు లోకేశ్ పర్యటించి ప్రభుత్వ దౌర్జన్యాలు, వైసీపీ నాయకుల అరాచకాలను ప్రజలకు వివరించనున్నారన్నారు. 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లోల శంఖారావం కార్యక్రమం జరుగుతుందన్నారు. యువగళానికి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా లోకేశ్ 220 రోజుల పాదయాత్రలో 3132 కిలోమీటర్లు నడచి ప్రజా సమస్యలు తెలుసుకుని చరిత్ర సృష్టించారని వారు చెప్పారు.

'రాబోయే రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సాకారం'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11: ముప్పై ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేశామని, రాబోయే రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సాకారం కాబోతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ కాకినాడ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంజయ్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడానికి రెల్లి, మాదిగతోపాటు అనుబంధ కులాలన్నీ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దళాయి శ్రీకాంత్, బండి యాదగిరి ఆధ్వర్యంలో 100మంది యువకులు ఎమ్మార్పీఎస్‌లో చేరారు. సమావేశంలో సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు, పెద్దసంఖ్యలో రెల్లి యువకులు, మహిళలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని ఏపీ రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు కోరారు. ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని తోటపల్లి, వెంకటనగరం, పోతులూరు గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ కరపత్రాలు పంచారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ని ప్రతి ఒక్కరు ఆదరించి ఆశీర్వదించాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధానిని చేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీ సెల్ కోఆర్డినేటర్ కొల్లు వీరగణేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, సమన్వయ కమిటీ సభ్యులు రామిశెట్టి చిన్న, పి.పెదబాబు ఉన్నారు.

నేడు 'స్పందన, డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 11: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం 0884 2357800 నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10.30గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చని కోరారు.

రేపటి నుంచి బాబా మందిర వార్షికోత్సవ పూజలు

కరప, ఫిబ్రవరి 11: మండలంలోని గురజనాపల్లిలోని షిర్డి సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవ పూజలను ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ తెలిపారు. 13న ఉదయం 8గంటలకు తాత్కాలిక ధుని వెలిగించి 9గంటలకు పల్లకి సేవ నిర్వహిస్తామన్నారు. 14న కలశపూజ తదితర పూజా కార్యక్రమాలు, 15న బాబా ఉత్సవమూర్తికి విబూది అభిషేకం, 18న దత్తాత్రేయస్వామికి తులసిదళాలతో అర్చన, 17న ఉదయం 6గంటల నుంచి బాబా వారి ధ్యాన మందిరంలో 545శ్రీ సాయి సచ్చరిత్ర ఏకాశ పారాయణం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా బల్లల పండుగ

కరప, ఫిబ్రవరి 11: కరపలో ఆదివారం రజకులు బల్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. శివగంగ రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రజకులు తీన్‌మార్ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో తమ కులదేవత ఈదమ్మతల్లి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సిపాయి చెరువు వద్ద చాకిరేవులోని బల్లల వద్ద ఈదమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైసీపీ నాయకులు సాదే లోహిదాస్, శివగంగ రజక సంఘం గౌరవాధ్యక్షుడు సైనవరపు సత్యనారాయణ, అధ్యక్షుడు మురమళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి సైనవరపు సతీష్, కోశాధికారి మంచాల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు కాకినాడ ఈశ్వరరావు, ఓదూరి వెంకటరమణ, ఎం.అప్పారావు, ఎస్.నూకరాజు పాల్గొన్నారు.

చొల్లంగిలో నిరసన ర్యాలీ

తాళ్లరేవు, ఫిబ్రవరి 11: చొల్లంగి సర్వేనెంబర్ 47/3, 4.42సెంట్లులో పేదలకు ఇళ్లపట్టాలివ్వాలని లబ్ధిదారులు ఆదివారం చొల్లంగి పురవీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసేన నేతలు అత్తిలి బాబూరావు, సుంకర రామచంద్రరావు, ముత్యాల జయలక్ష్మి మద్దతు పలికారు. వీరమహిళ ముత్యాల జయలక్ష్మి మాట్లాడుతూ గృహాలకు నివాసయోగ్యంలేని స్థలాలను కొనుగోలుచేసి ప్రజాధనాన్ని కాజేశారని ఆరోపించారు. జి.వేమవరం, పటవల గ్రామాల్లో ఇచ్చిన పట్టాలను రద్దుచేసి చొల్లంగిలో స్థానికంగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళి

పిఠాపురం, ఫిబ్రవరి 11: జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి రావూరి సుధాకర్, పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వత్సవాయి వరహాలబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, అల్లుబోయిన సూరిబాబు పాల్గొన్నారు.

లింగంపర్తి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సూరిబాబు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11: ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా ఆదివారం మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తనయుడు వరుపుల సత్యసూరిబాబు బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా కాసెపు వీరబాబు, సోము సూర్యుడు కూడా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వరుపుల చిట్టిబాబు, గ్రామ రైతులు, సొసైటీ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

తాళ్లరేవు, ఫిబ్రవరి 11: తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా ప్రజాపరిషత్ 1985-86 పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం కోరింగ ఫారెస్టు బంగ్లా ఆవరణలో రోళ్ల శ్రీనివాసచక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ స్నేహితులతో సంతోషంగా గడిపారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకునేందుకు సేవింగ్‌ఫండ్‌ను ఏర్పాటు చేద్దామని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

తిరుమల	:	యాత్ర 2
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 11: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో గొల్లప్రోలులో ఆదివారం నిర్వహించిన హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రచారసభ హైదరాబాద్ నేతృత్వంలో రాజమహేంద్రవరం శాఖ పర్యవేక్షణలో పట్టణంలోని మాధురి విద్యాలయలో ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలకు 364మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు హాజరుకాలేదు. పరీక్షలు జరుగుతున్న తీరుని ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



గొల్లప్రోలులో ప్రచారం చేస్తున్న వర్మ

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

గొల్లప్రోలు, ఫిబ్రవరి 11: గ్రామాలు, పట్టణాల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో జరిగింది శూన్యమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. వరద ముంపు నివారణకు గానూ ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులకు రూ.156కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ పనులు అవసరం లేదని లేఖ ఇచ్చి రద్దు చేయించారని తెలిపారు. రూ.70కోట్లుతో తాగునీటి ప్రాజెక్టును తీసుకువచ్చామన్నారు. తాము తీసుకువచ్చిన నిధులు తప్ప కొత్తగా అభివృద్ధి కోసం వైసీపీ ప్రజాప్రతినిధులు ఒక్క రూపాయి తీసుకురాలేకపోయారని తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, గుళ్ల సుబ్బయ్య, గంటా చంద్రరావు, శీరం మాణిక్యం, బస్సా సత్యనారాయణ, కడారి బాబ్జి, పేకేటి చక్రధరరావు, దువ్వా తాతాజీ, బస్సా నాగేశ్వరరావు, గండే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో 'బాబు ష్యూరిటీ'

పిఠాపురం: పట్టణంలోని 3వ వార్డులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. స్థానిక నాయకత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని వర్మ తెలిపారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, నేతలు కేశబోయిన సత్యనారాయణ, గోలి అమరనాథ్, పాలిక ప్రవీణ్, మునిని కల్యాణ్, ఆటో చిన్నా, గౌతు సతీష్, చామంతి శ్రీనివాస్, సతీష్, బుజ్జి, మరం అనిల్ పాల్గొన్నారు.

మేరీమాత యాత్ర మహోత్సవం





సందేశం ఇస్తున్న క్రీస్తు రాజు, మరియగిరికి పోటెత్తిన జనం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11: ప్రత్తిపాడులోని మరియగిరిపై వేంచేసిన మేరీమాత దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మరియగిరి కొండపై ఆర్‌సీఎం చర్చి రెవరెండ్.ఫాదర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరీమాత యాత్ర మహోత్సవ వేదికకు ప్రధాన వక్తగా హైదరాబాద్‌కు రెవరెండ్ ఫాదర్ క్రీస్తురాజు హాజరై సందేశం ఇచ్చారు. ఏసును నమ్ముకుని జీవిస్తున్న ప్రతి ఒక్కరి హృదయాల్లో మేరీమాత కొలువై ఉంటారన్నారు. నేటి యువత మేరీమాతను ఆదర్శంగా తీసుకుని జీవించాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో దివ్య పూజాబలిని చిన్నప్ప నిర్వహించారు. సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని రోగాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ఏసు కాపాడాలని పలువురు చర్చి ఫాదర్‌లు ప్రసంగించారు. కొండపై 15 అడుగుల లూద్ మాత విగ్రహం వద్ద కూడా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా మేరీమాతను దర్శించుకున్నారు. మేరీమాత ఆలయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన పులిహోరను భక్తులకు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు ఉన్నారు.

జ్యోతిర్లింగాల ప్రతిష్ఠకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 11: ఇర్రిపాక శివాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠకు ఆదివారం అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధన్, పంచగవ్యప్రవచన, గోపూజ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, మండపారాధన, రుద్విక్‌వరుణ, అంకురార్పణ, అగ్నిమదనం, అఖండ దీపారాధన, పూజలు నిర్వహించారు. ఈనెల 12,13న ఆదివాసాలు నిర్వహించి 14న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ జరుగుతుందని నెహ్రూ తెలిపారు. జ్యోతుల సుబ్బారావు, అడబాల భాస్కరరావు, జ్యోతుల లక్ష్మీదేవి, జ్యోతుల అనీష్ నెహ్రూ పాల్గొన్నారు. ఇర్రిపాకలో ప్రతిష్ఠించనున్న ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శివలింగానికి శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పుణ్య నదీజలాలతో అభిషేకించి పాండ్రంగి రాంబాబు, నలమాటి ఆనంద్, ఈర్పిన వెంకట్రావు, చెలికాని హరిగోపాల్ నెహ్రూకు అందజేశారు.

'నీటి పిల్లులను కాపాడుకోవాలి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

తాళ్లరేవు, ఫిబ్రవరి 11: నీటి పిల్లులు అంతరించుకుపోతున్న తరుణంలో వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఫారెస్ట్ అధికారిణి ఎస్.భరణి అన్నారు. ఆదివారం కోరింగ అభయారణ్యంలో నీటిపిల్లిల ఆవశ్యకత, సరంక్షణలపై ఆదిత్య కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటిపిల్లి పోస్టర్‌ను ఫారెస్ట్ అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్, ఎఫ్ఎస్‌వోలు ప్రసాద్, సిద్దార్థకుమార్, అరుణ, వసంత, ఎఫ్‌బీవోలు గోపినాగేంద్రకుమార్, మహేష్, ధనుంజయరావు, లెక్చరర్స్ తేజశ్వరరావు, దివాకరరావు, ఫారెస్ట్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కాకినాడలో 'యుద్ధానికి సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 11: జనసేన కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో 21వ డివిజన్ జె.రామారావుపేటలో డివిజన్ అధ్యక్షుడు మండపాక దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు పెంచిన జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శశిధర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై మేము యుద్ధానికి సిద్ధమని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీలు మరింత పెంచడానికి, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టడానికి, ప్రజలను పట్టి పీడించుకోవడానికి వైసీపీ సిద్ధంగా ఉందన్నారు. దుగ్గన బాబ్జి, మహేశ్వరరావు, తులసి, షేక్ అహ్మద్, గుత్తుల మల్లేశ్వరరావు, పిల్లి దుర్గారావు, షేక్ కరీం, చిక్కం సూరిబాబు, ఎండీ అహ్మద్, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తదితరులున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ముత్తా శశిధర్

తెలుగుదేశం పార్టీలోకి చేరికలు



సామర్లకోట:టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాజప్ప



కోటనందూరు:టీడీపీలో చేరుతున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 11: సామర్లకోట మాజీ కౌన్సిలర్ పితాని సూర్యనారాయణ తన అనుచరులు 100 మందితో కలిసి ఆదివారం టీడీపీలో చేరారు. 5వ వార్డులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరయ్యారు. సూర్యనారాయణ, అనుచరులకు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాజప్ప మాటాడుతూ వైసీపీ పాలనంతా అస్తవ్యస్తం, నిత్యావసర వస్తువుల ధరలు పెంపుదల, విద్యుత్, బస్ చార్జీల పెంపుదల వంటి అంశాలతో ప్రజలను ఆర్థికంగా కుదేలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనల కూటమిని గెలిపించాల్సిన అవసరం మనందరిపైనా ఉందని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటనందూరు: జగన్నాధపురం గ్రామంలో వైసీపీ కార్యకర్తలు 50మంది టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో వార్డు మెంబర్ గుడివాడ అర్జున్, చింతకాయల నాయుడుతో 50 మంది మాజీ మంత్రి దాడివీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సుర్ల లోవరాజు, మేతూకూరి వెంకటేష్, లెక్కల భాస్కర్, లంక చినసత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం

తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య



తునిలో ప్రచారం నిర్వహిస్తున్న దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 11: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పర్యవేక్షణలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాన్ని తునితో పాటుగా ఎస్.అన్నవరం పంచాయతీ శివారు రామకృష్ణ కాలనీలో ఆదివారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు అందజేశారు. దివ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్నది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని ప్రజలు ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా టీడీపీ, జనసేన పార్టీలు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, ఎన్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగసోమరాజు, అప్పల రమేష్, జక్కన రామానాయుడు, తమరాన రామకృష్ణ, తుని పట్టణ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ నాయకులు ఉన్నారు.

ముక్కోటి దేవతలు కూర్చొనే పీఠం పీఠికాపురం



అనుగ్రహభాషణ చేస్తున్న స్వామిజీ

పరిపూర్ణానంద సరస్వతి స్వామిజీ

పిఠాపురం, ఫిబ్రవరి 11: దేవతలు నడయాడిన నేల, ముక్కోటి దేవతలు కూర్చొనే పీఠం కనుకే పీఠికాపురం అయిందని శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి స్వామిజీ అన్నారు. అందువల్లే పిఠాపురంలో దేశం నలుమూలలు నుంచి స్వాములు, సాధువులు, సన్యాసులు వచ్చి సంచరిస్తున్నారని, ఎన్నో ఆలయాల ప్రతిష్ఠ జరుగుతున్నదని తెలిపారు. పిఠాపురంలోని అగ్రహారంలో కొలువైన సోమేశ్వరస్వామి దేవస్థానం చెంతనే నూతనంగా నిర్మించిన ఉషా చాయాపద్మిని సమేత సూర్యనారాయణమూర్తి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోశ్చారణల నడుమ పరిపూర్ణానంద చేతుల మీదుగా ఆదివారం జరిగింది. ఆలయ శిఖరంపై కలశస్థాపన నిర్వహించారు. స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. పిఠాపురం గొప్పతనాన్ని పురాణాల్లో వివరించారని తెలిపారు. పిఠాపురానికి సమీపంలోనే శ్రీపీఠం ఉందని, అక్కడ నిర్వహించిన మహాశక్తి యాగంలో పదిలక్షల మంది కోటి కుంకుమార్చనలో పాల్గొన్నారని చెప్పారు. రానున్న రోజుల్లో పిఠాపురం మరో కాశీగా అవతరిస్తుందని తెలిపారు. ప్రతిష్ఠా కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సూరవరపు సురేష్, కృష్ణార్జునరావు, మునేశ్వరరావు, కోటేశ్వరరావు, ఆగంటి ప్రభాకరావు, బాలిపల్లి రాంబాబు, సుధీర్‌రాజు, బొజ్జా రామయ్య,పెదకాపు ఉన్నారు.

మర్లావలో 'పల్లెకు పోదాం'



పెద్దాపురం మండలం మర్లావ గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

పెద్దాపురం, ఫిబ్రవరి 11: బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని మర్లావ గ్రామంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా బీజేపీ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రావూరి సుధ హాజరయ్యారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజానీకానికి కేంద్ర పథకాలను మరింతగా చేరువచేసేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతీ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను తెలియచేయడానికే ఈ పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమలో బీజేపీ నేతలు తుమ్మల పద్మజ, దుర్గా మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రిపూడిలో...

కరప, ఫిబ్రవరి 11: కరప మండలం గొర్రిపూడిలో బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావూరి సుధ పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు, మహిళా సాధికారతపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వరాలబాబు, జిల్లా ఇన్‌చార్జి రంబాల వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలీ, అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండలరవు (నాని), అనపర్తి వెంకటేష్, వై.పద్మావతి, వై.నాగశివ, వై.వీర సత్యవేణి, డి.నారాయణమ్మ నాయకులున్నారు.

బైక్‌లపై యువత హల్‌చల్!

» రౌతులపూడిలో భయాందోళనకు గురవుతున్న విద్యార్థినులు

» పోలీసులు పట్టించుకోవాలని వినతి

రౌతులపూడి, ఫిబ్రవరి 11: రౌతులపూడి హైస్కూలు రహదారిలో ఉదయం, సాయంత్రం యువకులు బైక్‌లపై హల్‌చల్ చేస్తున్నారు. వేగంగా బైక్‌లు నడుపుతున్నారు. పాఠశాల తెరిచే ముందు, వదిలే ముందు సమయం చూసుకుని యువకులు బైక్‌లపై వస్తున్నారు. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా విద్యార్థినులపైకి వారు బైక్‌లతో వేగంగా దూసుకెళ్తున్నారు. ప్రతిరోజు ఇలా జరగడంతో ఆకతాయిల హింసను భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఇంటి దగ్గర చెబితే పాఠశాలకు వెళ్లకుండా మాన్పించేస్తారనే భయంతో బయటకు చెప్పలేకపోతున్నామంటున్నారు. ఈ ప్రాంతంలోనే కాన్వెంట్ కూడా ఉంది. గతంలో ఇదే మాదిరిగా యవకులు హల్‌చల్ చేయగా అన్నవరం పోలీసుల రంగప్రవేశంతో వారి హడా విడి తగ్గింది. ఇటీవల మళ్లీ వారం రోజుల నుంచి యువకులు బైక్‌లపై హల్‌చల్ చేయడం ఎక్కువైంది. యువకుల నుంచి తమను కాపాడాలని పోలీసులను విద్యార్థినులు విన్నవిస్తున్నారు.

కరపలో అన్న క్యాంటీన్



భోజనాలు వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

కరప, ఫిబ్రవరి 11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కటకం వెంకట ప్రభాకర్ ఆధ్వర్యంలో సంచార అన్న క్యాంటీన్ ప్రారంభించి 200 రోజులైన సందర్భంగా కరప మార్కెట సెంటర్ వద్ద ఆదివారం అన్న క్యాంటీన్ ద్వారా ప్రజలకు భోజనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు నున్న దొరబాబు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి ప్రభాకర్ భోజనాన్ని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ ద్వారా ఎంతోమందికి ఉపయోగంగా ఉండేదని, వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్యాంటీన్‌లను నిర్వీర్యం చేసి పేదల పొట్టపై కొట్టిందన్నారు.

రౌతులపూడిలో అగ్ని ప్రమాదం

రౌతులపూడి, ఫిబ్రవరి 11: గ్రామంలోని శెట్టిబలిజపేటలో ఆదివారం ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. గుబ్బల రామయ్యమ్మ, బత్తిన కన్నయ్యమ్మకు చెందిన ఇళ్లు కాలిపోయాయి. వంటగ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో గుబ్బల రామయ్యమ్మకు రూ.75 వేలు, బత్తిన కన్నయ్యమ్మకు రూ.5లక్షలు వాటిల్లినట్టు రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. మాజీ సొసైటీ డైరక్టర్ యర్రా వరహాలుదొర అగ్నిబాధితులకు రూ.5వేలు నగదును అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అందించారు. పౌష్టిహారం, సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులను అభినందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో సూర్యనారాయణ దంపతులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎంవీ.ప్రసూన, ఎంవిశ్వేశ్వరరావు, ఎం.శాస్త్రి, శ్రీదేవి, శ్రీవాణి, ఎం.రమాసుందరి, చల్లా విజయలక్ష్మి ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు

తుని రూరల్, ఫిబ్రవరి 11: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో అభినందన కార్యక్రమం జరిగింది. విద్యా సాంస్కృతిక, క్విజ్, ఆటల పోటీలు, పోటీ పరీక్షలు వంటి అనేక అంశాల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణస్థాయిలో ప్రతిభ కనబరిచిన, నూరు శాతం హాజరు కనబరిచిన విద్యార్థులకు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ బహుమతులు అందజేశారు. సుమారు 900 మందిని బహుమతులతో సత్కరించడం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, ఫిబ్రవరి 11: మల్లేపల్లి గ్రామం నీలికుండీల తోటకాలనీ రామాలయం వద్ద ఆదివారం రాజమహేంద్రవరం ఆగ్రవాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయనేహ సుమారు 105 మందికి పైగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. క్యాంప్ మేనేర్ హరిబాబు, గ్రామపెద్దలు తెలగ రెడ్డి భద్రరావు, మాజీ ఉప సర్పంచ్ దాలంకి శ్రీను ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కరప, ఫిబ్రవరి 11: లయన్స్ క్లబ్ వేళంగి సహకారంతో శ్రీనివాసా నర్సింగ్ హోంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాపిటివ్ ఆసుపత్రి వైద్యుడు సత్యసందీప్, జ్యోతిర్మయి వైద్య సేవలందించారు. 200 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బొండా వెంకన్నరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి నరేష్ తదితరులున్నారు.

సత్తెమ్మతల్లి జాతర

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11: ప్రత్తిపాడులో గ్రామదేవత సత్తెమ్మతల్లి 47వ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కత్తిపూడి విఘ్నేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో బ్రతుకు చిత్రం సాంఘిక నాటకం ఆకట్టుకుంది. కాకినాడ కళాకారులు ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన అలరించింది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గమ్మ ఆలయంలో రద్దీ

గండేపల్లి, ఫిబ్రవరి 11: మండలంలో మురారి గ్రామ శివారులో వెలిసిన దుర్గమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధికంగా తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సంతోషంగాగడిపారు.

కత్తిపూడిలో అభిషేకాలు

శంఖవరం, ఫిబ్రవరి 11: కత్తిపూడి దుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ సందర్భంగా వాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. క్లబ్ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చిక్కిన సెల్‌ఫోన్ దొంగలు

తుని రూరల్, ఫిబ్రవరి 11: రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు కాకినాడ ఇన్‌స్పెక్టర్ గౌస్‌బేగ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా తునిలో ఇద్దరు పట్టుబడ్డారు. రైల్వే పోలీసులు వారిని అదుపులోకి తీ సుకుని ఆరా తీయగా దొంగ సొత్తులు కలిగి ఉన్నట్టు గుర్తించారు. వారి నుంచి రూ.2లక్షలు నగదు, 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ.3.30లక్షలుగా ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపారు.



పట్టుబడిన నిందితులతో రైల్వే పోలీసులు